క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



ఆత్మకూరు: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అల్లూరికి ఘన నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: విప్లవ వీరుడు, స్వాతంత్ర్యసమర యోధుడు అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని సున్నిపెంటలో నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథ నాయకుడు వై.ఆశీర్వాదం ఆధ్వర్యంలో భగత్ సింగ్ కాలనీలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్రీను, షేక్షావలి, వెంకటేశ్వర్లు, బాబు, సమద్, ప్రగతిశీల మహిళాసంఘం నాయకులు శివాని, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు నిధుల మంజూరు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో నిర్మించిన ప్రభుత్వ భవనాలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరైనట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు మంగళవారం తెలిపారు. మండలంలోని సచివాలయాలు, మినీ గోకులాలు, హార్టికల్చర్ ప్లాంటేషన్, రైతుభరోసా కేంద్రాల చెందిన రూ.74 లక్షలు నిధులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధుల మొత్తాన్ని మెటిరియల్ పేమెంట్ కింద లబ్ధిదారుల అకౌంట్లలోకి జమ చేశామని చెప్పారు. అన్ని గ్రామాలలో ఈ ప్రక్రియ పూర్తిఅయిందని, కొక్కెరంచ గ్రామానికి నిధులు సరిపకపోక పోవడంతో బిల్లులు జమచేయలేదని తెలిపారు.

కొణిదేలలో ధార్మిక కార్యక్రమాలు



కొణిదేలలో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న ధర్మప్రచార పరిషత్ సభ్యులు

నందికొట్కూరు: భగవంతునిపై భక్తి బతుకును భగవన్మయం చేస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో వెలసిన శివాలయంలో ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు ధార్మిక ప్రవచనాలు, ప్రతి రోజు స్థానిక భజన, మండలిచే భజనలు శుక్రవారం వరకు సాగుతాయన్నారు. అనంతరం గ్రామంలో భగవద్గీత ప్రచారకులు వీరం నాగేశ్వరరెడ్డి ధార్మిక ప్రవచనం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు నవీన్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు చిట్టెన్న, బాలీశ్వరుడు, రాజు, మద్దిలేటి, మధుసూదన్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానంది ఆలయంలో ఎలక్షన్ అబ్జర్వర్

మహానంది: మహానందీశ్వరుని సన్నిధిలో నంద్యాల జిల్లా ఎన్నికల అబ్జర్వర్ దినేష్ కుమార్ మంగళవారం రాత్రి పూజలు నిర్వహించారు. ఆయన శ్రీకామేశ్వరీ దేవి, శ్రీమహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు వారికి స్వామి అమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



మసీదుపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్

మహానంది : ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బంధువులు శిల్పా, శ్రీలక్ష్మీ, రామేశ్వరి కోరారు. మహానంది మండలంలోని మసీదుపురం గ్రామంలో సర్పంచు కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. తిమ్మాపురం గ్రామంలో యువ నేత ఒంటెద్దు వీరారెడ్డి, తమ్మడపల్లె గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గాజులపల్లెలో మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి ఎల్లాల బాబు, సీనియర్ నేత కొండా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

బూతులు మాట్లాడే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి

- వెలుగోడు రోడ్‌షోలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బుడ్డా శేషారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం
- అన్ని వర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతు



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా శేషారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

వెలుగోడు: ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ బూతులు మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వెలుగోడు పట్టణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డితో కలిసి భారీ జనసందోహం మధ్య రోడ్‌షో నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్, అంబేద్కర్ సెంటర్ మీదుగా పాతబస్టాండ్ అరుగుల వరకు రోడ్‌షో సాగింది.

అడుగడుగునా ఘన స్వాగతం

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా శేషారెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. తనదైన శైలిలో ప్రజలతో శిల్పా మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ..పార్టీ నేతలు, కార్యకర్తలతో సమన్వయంగా ముందడుగు వేశారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తు, వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటు ఎన్నికల ప్రచారం కొనసాగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తూ ప్రజల మద్దతు కోరారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభించింది. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు చక్రపాణిరెడ్డిని ఆశీర్వదించి, హారతులు ఇచ్చి మరీ ఎన్నికల్లో గెలవాలని దీవించారు.

లస్కర్‌లా పని చేసి నీరందించా

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ 14 నుంచి 17 టీఎంసీలకు పెంచామని ఎమ్మెల్యే తెలిపారు. తెలుగు గంగ లైనింగ్ పనుల కోసం ఒక్క ఏడాది నీటిని ఆపామని, 3.5 టీఎంసీల నీటిని నిలుపుదల చేసి లస్కర్‌లాగా పని చేసి వారబందీగా వెలుగోడు, అబ్దుల్లాపురం రైతుల పంటలను కాపాడానని గుర్తు చేశారు. ఇకపై రెండు పంటలకు నీరిచ్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. వెలుగోడులో సీహెచ్‌సీని రూ.6.10 కోట్లతో నిర్మించామని, జగనన్న పథకాలు ఎవరికైనా అందలేదంటే దానికి చంద్రబాబు ప్రభుత్వం చేసిన సాధికార సర్వేనే కారణమన్నారు. ఆ తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. బుడ్డా రాజశేఖరరెడ్డి ఓటమి భయంతో తిట్ల దండకం మొదలుపెట్టారన్నారు. గెలువలేమనే భయంతో దూషణలకు దిగుతున్నారని మండి పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఉందని, ఓట్లు అభ్యర్థించడంలో తప్పు లేదన్నారు. బుడ్డా రాజశేఖరరెడ్డి లాగా కమీషన్లకు అమ్ముడపోలేదని, నీరు–చెట్టు కింద పథకం నిధులు దోచుకొని తినలేదని టీడీపీ నేతను విమర్శించారు. జమీయా మసీదు అల్లా సాక్షిగా మసీదు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి..సీఎంతో చర్చించి బడ్జెట్‌లో ఫైల్ పెట్టించానని, ఆ డబ్బు రాకపోతే తన సొంత డబ్బులు డిపాజిట్ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఇందుకు మాజీ ఎమ్మెల్యే సిద్ధమా అని సవాలు విసిరారు.

'నీలా పార్టీలు మారడం, డ్రామాలాడటం చేతకాదు'

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి మాదిరిగా పార్టీలు మారడం, డ్రామాలాడటం తనకు చేతకాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి విమర్శించారు. వెలుగోడు రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ..తెలుగు దేశం సానుభూతిపరులు కూడా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు పొందుతూ ..ఎన్నికల సమయంలో లబ్ధి పొందలేదని విమర్శించడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు మానుకొని, తాను చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. టీడీపీ మేనిఫెస్టో అంతా మోసం, అబద్ధాలే, కూటమి నేతలే చంద్రబాబు మేనిఫెస్టోను నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ గుంద్రెడ్డి రాఘవరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుంపరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, వాణిజ్య విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యూనుస్, నాయకులు నసిరుల్లాఖాన్, ఇలియాస్ ఖాష్, మండల కార్యదర్శి కే. రామ్మోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, వంగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



అల్లూరులో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం

- పేదల వైపు జగన్, పెత్తందార్ల వైపు చంద్రబాబు
- ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి
- ఎన్నికల ప్రచారంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్



అల్లూరులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్‌లకు స్వాగతం పలుకుతున్న మహిళలు

నందికొట్కూరు రూరల్: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు మళ్లీ పట్టం కట్టాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరు, శాతనకోట, బొల్లవరం, మల్యాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో నవరత్నాల పథకాలతో ఆర్హత కలిగిన ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నారని గుర్తు చేశారు. మళ్లీ సంక్షేమ పాలన వస్తే ప్రజలు ఆర్థికంగా మరింత ముందుకు వెళతారన్నారు.

బాబు మోసపూరిత హామీలు నమ్మొద్దు...

చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు ఎవరూ నమ్మొద్దని, సాధ్యం కాని హామీలతో బాబు ప్రజల ముందుకు వస్తున్నారని సిద్ధార్థరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పేదలంతా జగనన్న వైపు ఉంటే డబ్బున్న వారంతా టీడీపీ వైపు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఒక్క విద్యార్థినైనా చదివించారా అని ప్రశ్నించారు.

సేవ చేసే అవకాశం ఇవ్వండి

నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ కోరారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మే 13న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రవియాదవ్, జెడ్పీటీసీ కరిమున్నిసా, వైస్ ఎంపీపీ కట్టా మంజుల, సర్పంచులు జనార్దన్‌గౌడు, ఉమాదేవి, మరియమ్మ, ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, మాండ్రవేదవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీతో శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించుకుందాం



సంజీవనగర్‌తండాలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మాజీ కౌన్సిలర్ లాలు, అబ్జర్వర్ సుదర్శన్‌రెడ్డిల ఆధ్వర్యంలో మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న దృశ్యం



సున్నిపెంటలో ప్రచారం నిర్వహిస్తున్న తిలోత్తమరెడ్డి



శ్రీశైలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని సంజీవనగర్‌తండా ప్రజలు అన్నారు. మంగళవారం మండలంలోని సంజీవనగర్‌తండా గ్రామంలో సర్పంచ్ నాగులునాయక్, ఎంపీటీసీ లక్ష్మీబాయి, గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ప్రతి ఇంటింటికి తిరుగుతూ సీఎం జగనన్న విడుదల చేసిన మేనిఫెస్టోను వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివశంకర్‌నాయక్, నాయకులు బాలునాయక్, వెంకటేశ్వర నాయక్, నాగరాజునాయక్, శ్రీనివాసనాయక్, బాలాజీనాయక్, బాలరాజునాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు పట్టణంలోని 13వ వార్డులో 67, 72 బూత్‌లలో మాజీ కౌన్సిలర్ లాలు, అబ్జర్వర్ సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లేనని చెప్పారు. పట్టణంలోని 13వ వార్డులో 69వ బూత్ పరిధిలోని ఆత్మకూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్ ఆధ్వర్యంలో అబ్జర్వర్ ప్రశాంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మోమిన్, మునీర్‌బాషా, మోమిన్ వహీద్, ఎస్.ఎస్.సలావుద్దీన్, జిలానీ, వార్డు యువకులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రచారం

శ్రీశైలంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే డమ్మీ ఈవీఎంతో ప్రజలకు ఓటు వేసే విధానాన్ని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు టీఎండీ.రఫీ, ప్రభావతి, పార్వతి, లక్ష్మీదేవి, కొటమ్మ, సవమ్మ, విష్ణు, ఏడుకొండలు, సీతారాం నాయక్, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్‌బజార్‌లో ఎన్నికల ప్రచారం

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంటలోని మెయిన్ బజార్, 5వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోదరి వంగా తిలోత్తమ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని 'ఫ్యాను' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, అంబేద్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ జి.శోభన్‌బాబు, పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, భరత్‌రెడ్డి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గెలిచేది వైఎస్సార్‌సీపీనే



ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



జి.వీరాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



పి.లింగాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి



పాములపాడులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ సర్పంచు విజయసింహారెడ్డి



వేంపెంటలో దివ్యాంగురాలికి కరపత్రం అందజేస్తున్న సొసైటీ మాజీ చైర్మన్ రమణారెడ్డి



తలముడిపి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ



80బన్నూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లారెడ్డి, కార్యకర్తలు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డిలను గెలిపిస్తాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 12, 28 వార్డుల్లో కౌన్సిలర్లు లాలు ప్రసాద్, రాధికతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 28వ వార్డులో బైరెడ్డి శివారెడ్డి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, కౌన్సిలరు అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బీటెక్ రాజశేఖర్, వేణు, రమేష్, షే క్షావలి, ఆర్ట్ శ్రీను, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలో మాజీ సర్పంచు విజయసింహారెడ్డి, నీటి సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్ర చారం నిర్వహించారు. అలాగే కో ఆప్టెడ్‌ముర్తుజావలి, బానుముక్కలలో మాజీ సర్పంచు బాలునాయ క్, ఉశేన్, వేంపెంటలో సింగిల్ విండో మాజీ చైర్మన్ రమణారెడ్డి, మద్దూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీటీసీ బషీరాహ్మద్, జబ్బార్, క్రిష్ణానగర్‌లో మహానందిరెడ్డి, పీరయ్య, శ్రీనివాసగౌడు, చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, డైరెక్టర్ గోపాల్, ఇస్కాలలో సర్పంచు మౌలాలి, బానకచెర్లలో ఓబన్నగౌడు, మిట్టకందాలలో యు గంధర్‌రెడ్డి, ఆయా గ్రామ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దార సుధీర్, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిల ఫ్యాన్ గుర్తులపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.

మిడుతూరు: తలమడిపి గ్రామంలోని ఎస్సీ కాలనీ, కురువ పేట, పెద్ద బజారు, బీసీ, మైనార్టీ కాలనీల్లో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సామన్న, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నాగారెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, నాయకులు మల్లు శివనాగిరెడ్డి, పాలగ్గారి స్వామిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని జి.వీరాపురం గ్రామంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న ముఖ్యమంత్రి కావాలంటే నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్‌ను, నంద్యాల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానంద రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామిరెడ్డి, మల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, మల్లయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం, మండ్లెం, పారుమంచాల, రామసముద్రం, 80 బన్నూరు, తూడిచెర్ల గ్రామాల్లో జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు గుండ్రెడ్డి భాస్కర్ రెడ్డి, ఎల్లారెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, మాధవరం దేవసహాయం, దొడ్డాసుధాకర్, ఉపసర్పంచ్ చెన్నారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా దారా సుధీర్, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించుకొని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, మహేశ్వరమ్మ, ఫయాజ్, పుల్లయ్యగౌడు, వడ్డెమహేష్, సాంబ, నాగిరెడ్డి, రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, చిన్నకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, మాధవరం రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జంగాల కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో శిల్పా కార్తీక్‌రెడ్డి



యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్‌లోని 16వ వార్డులో కౌన్సిలర్ విజయ్‌చౌదరి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్ ఆధ్వర్యంలో 16వ వార్డు టీడీపీకి చెందిన 20 జంగాల కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి వారికి పార్టీలు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

చెంచులను అన్నివిధాలా ఆదుకుంటాం

మండలంలోని నాగలూటి, బైర్లూటి, కొట్టాలచెరువు, పెద్దచెరువు, అమలాపురం చెంచుగూడెంలను అభివృద్ధి చేస్తామని, గిరిజనులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాగలూటి, బైర్లూటి చెంచు గూడెంలను సందర్శించారు. గిరిజనులతో ఆయన మాట్లాడుతూ గిరిజన గూడేలలో మంచినీరు, పక్కా గృహాలు, రహదారులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే గిరిజనులకు వైద్యసేవలు, అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ఎన్నికల్లో తన తండ్రి శిల్పా చక్రపాణిరెడ్డి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుంట శివారెడ్డి, జెడ్.శ్రీనివాసరెడ్డి, శివశంకర్‌నాయక్, బైర్లూటి, నాగలూటి గూడాల గిరిజనులు పాల్గొన్నారు.

హజ్, ఉమ్రా యాత్రికులకు శిల్పా కార్తీక్‌రెడ్డి సన్మానం

పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్‌అహ్మద్ పిలుపు మేరకు మంగళవారం ఆయన స్వగృహం వద్ద పవిత్రమైన హజ్ యాత్ర, ఉమ్రా యాత్రకు వెళ్లే యాత్రికులను శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి సన్మానించారు. వారికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మకూరులో వడగండ్ల వర్షం



ముప్పపల్లిలో తడిసి ముద్దయిన పక్షులు

ఆత్మకూరు: మండలంలో మంగళవారం పెనుగాలులు, వడగండ్ల వర్షానికి పశుపక్షాలు, ప్రజలు వణికిపోయారు. వేకువజామున ఒక్కసారిగా వాతావరణం మార్పు చెంది భారీ పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో వడగండ్ల వర్షం కురిసింది. నల్లమల అటవీ సమీపంలోని ముష్టపల్లి, సిద్ధపల్లి, సిద్ధాపురం, పెద్దఅనంతపురం, బాపునంతపురం, ఇందిరేశ్వరం, కురుకుంద గ్రామాల్లో వడగండ్ల వర్షానికి కొంగలు, చిలుకలు తదితర పక్షులు విలవిల్లాడాయి. ముష్టపల్లె గ్రామంలో పలు కొంగలు చనిపోగా, మరికొన్ని కొంగలు, రామచిలుకలు వర్షపునీటిలో కొట్టుకుపోయాయి. అన్ని గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంగళవారం రాత్రి అంధకారంలో మగ్గే పరిస్థితి తలెత్తింది. ఈదురుగాలులకు పశువులకు వేసిన పాకరేకులు ఎగిరిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరగడంతో విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. వడగండ్ల వర్షానికి కొంగలు, పిచ్చుకలు, రామ చిలుకలు మృత్యువాత పడగా, పలు కొంగలు, రామ చిలుకలు మొత్తం బురదనీటిలో పడి విలవిల్లాడుతుండగా ప్రజలు వాటిని కాపాడి రోడ్లపై వేసి నీళ్లు చల్లారు. కొంగలను కుక్కలు నోటి పట్టుకుని కొరికివేయడంతో అధికంగా మృత్యువాతపడ్డాయి. సాయంత్రం కూడా అక్కడక్కడ గ్రామాల్లో వర్షం కురిసింది.

కొత్తపల్లిల్లో ఉరుములు మెరుపుల వర్షం

కొత్తపల్లి: మండలంలో మంగళవారం వేకుజాము నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఈ వర్షం బీభత్సం రేపింది. వర్షం పడడంతో సుమారు ప్రతిరోజు 46 డిగ్రీల వేడి వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో వేసవి దుక్కులకు ఈ వర్షం ఎంతో దోహద పడుతుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, శివపురం, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 50.6 మి.మీల వర్షపాతం నమోదు అయింది.

పాములపాడులో 35.2మిల్లీ మీటర్ల వర్షపాతం

పాములపాడు: మండలంలో తెల్లవారు జా మున కురిసిన వర్షం 35.2మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

జూపాడుబంగ్లా: విపరీతమైన ఎండలతీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోతున్న మండల ప్రజలకు మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 9.6మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు.

మహానంది మండలంలో జోరుగా వర్షం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పాటు గాలులు వీచాయి. భారీ గాలులకు తిమ్మాపురం, గోపవరం, గాజులపల్లె గ్రామాల్లో సాగు చేస్తున్న అరటి తోటల్లో చెట్లు నేలకొరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మహానందీశ్వరుడికి ఏకాంత సేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి మంగళవారం రాత్రి ఏకాంత సేవ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల బృందం స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఏకాంత సేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

పిడుగు పడి ఎద్దులు మృతి

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని మల్యాల గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగు పడి రెండు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన నారాయణ వడ్డెపేట కాలనీలోని తన ఇంటి ఆవరణలో ఎద్దులను కట్టేసి ఉంచగా పిడుగు పడటంతో రెండు ఎద్దులు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో బాధితుడికి రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు.

నేడు సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కవిరాజ్ తెలిపారు. సమావేశానికి గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.